

**అమ్మకూ,** నాన్నగారికీ కలిగిన కాశీ యాత్రా వాంఛను తీర్చగలిగినందులకు సంతృప్తిగా గాలి పీల్చుకొన్నాను. ఉద్యోగంలో చేరినది మొదలు ఇంటిలో కాశీయాత్ర ప్రస్తావన రాని రోజు లేదు. చివరకు అది కూడ నెరవేర్చాను.

సరిగా ఏడు గంటలకు వారణాసి ప్లాట్ ఫారంమీద ఆగింది పంజాబ్ మెయిల్. అమ్మను, నాన్నగారిని మొదట పెట్టెలో ఎక్కించి సామాను లోపల పెట్టించి, కూలివానికి కూలి చెల్లించి వాడిని పంపేశాను. అనసూయ అమ్మకు, నాన్నగారికి నమస్కారం చేసి వారి కాళ్లను కళ్ల కద్దుకొంది. ప్రక్కనే ఉన్న పంకజ అందరిని బిత్తరపోయి చూడసాగింది. అనసూయ కళ్లలో నీరు తిరుగుతూంది. కళ్లు వత్తుకుంటూ "వస్తా బాబాయిగారూ, వస్తా పిన్నిగారూ. ఈ అభాగ్యురాలిని ఇక్కడ చూచామన్న సంగతి మరిచిపోండి" అని నోటిలో

**ఎవరో ఏదో అన్నారని ప్రతి చిన్న విషయానికి బాధపడే వ్యక్తులు ఉంటారు. బలహీనతకు చిహ్నమే అయినా ఈ బాధ సహజం. అసత్యమైతే సరిపెట్టుకోవచ్చు. అప్పుడూ కోపం ఉంటుంది. కాని మానవత్వాన్నే శంకించే మాటలు, అతి ప్రియమైన వారివల్ల పడికూడా ప్రేమనే చూపగల శక్తి కేవలం స్త్రీకి మాత్రమే ఉన్నది.**

చీరపైట క్రుక్కుకొంది.

"ఎప్పుడూ రోజు లిలాగే ఉండిపోవమ్మా. గుండె రాయి చేసికొని దీనిని పెద్దదానిని చేసుకో. జరిగిన దానిని మరిచిపో" అని అమ్మ ధైర్యం చెప్పింది.

గార్డు విజిల్ ఊది పచ్చదీపం చూపించాడు.

"తాతగారికీ, అమ్మమ్మగారికీ దండం పెట్టు, తల్లీ." పంకజతో చెప్పింది అనసూయ.

పంకజ నమస్కరించింది. చివరిసారిగా వారి వద్ద సెలవు తీసుకొని పెట్టె దిగింది అనసూయ.

"నువ్వుమాత్రం నన్ను జ్ఞాపకముంచుకోవాలి, తమ్ముడూ!"

ఆమె అశ్రువులు ప్లాట్‌ఫారంను కడిగివేశాయి. గంగాజలంకన్నా పవిత్రమైనది ఆ కన్నీరు. నా మనస్సు ద్రవించిపోయింది.

"నిన్ను ఎలా మరిచిపోతాను, అనసూయక్కా?" గాద్గదిక స్వరంతో పలికాను.

"క్షేమంగా వెళ్ళి కలకాలం వర్ధిల్లు, తమ్ముడూ ..." అక్కయ్య పాదాలను స్పృశించి రైలు ఎక్కాను. కళ్ళు తుడుచుకుంటూ బండి వెంట నడుస్తూ "ఈసారైనా నా గురించి కథ వ్రాయడం మరువకేం? వ్రాస్తావు కదూ?" అంటూ ఆపేక్షతో చూచింది.

"అలాగే, అక్కయ్యా." చెయ్యి ఊపాను.

లోనికి వెళ్ళి బెర్త్‌మీద వాలాను.

* * *

"తమ్ముడూ! నా కథ రాయవూ?" అన్న మాటలు చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఇది ఈనాటి అనసూయక్కయ్య కోరిక కాదు.

చిన్నప్పటినుంచీ నాకు కథలు వ్రాయాలనే అభిలాష ఉంది. స్కూలు వెలువరించిన పత్రికలో నా కథలు పడుతూండేవి. అప్పుడప్పుడు విరామసమయంలో మా తరగతి పిల్లలకు నేను కథలు చెబుతుండేవాడిని. నేనూ, అనసూయా ఒకే తరగతిలో చదివేవాళ్ళం. అందుచేత నా కథలంటే ఆమెకు ఇష్టం.

మేము ఫోర్త్‌ఫారం చదువుతున్న రోజులవి. ఒక రోజున అనసూయ గంభీరంగా నా వద్దకు వచ్చింది.

"అనసూయక్కా, అలాగున్నావేం?" నేను అడిగాను.

"తమ్ముడూ, నా కథ రాసేయ్. నేను చదువుకొంటాను."

అటువంటి కోరిక కోరుతుందని నేను ఏనాడూ ఊహించి ఉండను.

"ఏం, తమ్ముడూ, రాసిపెట్టవూ!" గడ్డం పట్టుకొని బ్రతిమాలింది.

"అలాగేలే, అక్కయ్యా" — ఆమెను అప్పటికి సంతృప్తిపరచడానికి అన్నాను.

అంతే ... ఆమె కోరిక కోరికగానే ఉండిపోయింది. ఆ ఏడే అనసూయను బడికి పంపడం ఆపివేశారు ఆమె తల్లితండ్రులు. ఆరు నెలలు తిరిగేసరికి అనసూయ పెళ్ళి నిశ్చయమైపోయింది. "పెళ్ళికొడుకు రామచంద్రపురం జమిందారుట. మూడవ పెళ్ళట. ఐతేనేం? పిల్ల అదృష్టవంతురాలు. కలవారి ఇంట్లో పడుతున్నది" అని అమ్మలక్కలు అనుకొన్నారు.

పెళ్ళినాడు సగం నెరిసిన బట్టతల, అరంగుళం మందం సులోచనాలూ పెట్టుకొన్న ముదునలిని చూచేవరకూ 'పెళ్ళికొడుకు' అనేవాడు నడుచుగా 'కొడుకు' లా ఉంటాడని ఊహించాను. కాని, ఆ దృశ్యం అంతా విపరీతంగా గోచరించింది. ఆ ముసలి పెళ్ళికొడుకు అనసూయ మెడలో మంగళసూత్రం కడుతూండగా ఏదో ఘోరమైన అన్యాయం జరిగిపోతున్నట్లనిపించింది.

పెళ్ళి తరువాత ఊరిలోనే ఉన్నా అనసూయ ఒక్కనాడుకూడ కంటికి కనుపించలేదు. ఇది ఆమె అత్తవారింటి ఆచారమట. రోజులు గడిచిపోయాయి.

అనసూయ అత్తవారింటికి వెళ్ళిపోతూన్నది. ఇంటిముందు గుర్రపుబళ్ళు సిద్ధంగా ఉన్నాయి. అమ్మలక్కలు అందరూ అక్కడకు చేరారు. నెమ్మదిగా నేనుకూడ బండివద్దకు వెళ్ళి నిలబడ్డాను. కన్నీరు తుడుచుకొంటూ బండి ఎక్కింది అనసూయ. ముత్తయిదువులు మంగళహారతి పాడారు. తరువాత లాంఛనప్రాయంగా సాగనంపు పాట పాడారు. ఆమె తల్లి తండ్రులు బాధ్యత తీరినందులకు నిట్టూర్చారు. బండి కదులుతూండగా నన్ను చూచింది అనసూయ.

"వెళ్ళివస్తా, తమ్ముడూ ... కథ సంగతి మర్చిపోకేం?" అని అభ్యర్థించింది.

అలాగే నన్నట్లు తల ఊపాను. యజ్ఞపశువును పూర్వం ఆ విధంగానే యజ్ఞశాలకు తీసుకువెళ్ళేవారేమో!

తరువాత అనసూయను మా ఊరిలో చూడటం జరుగలేదు. ఏడు సంవత్సరాలు జరిగిపోయాయి. కాలేజి చదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరడం కూడా జరిగిపోయింది. సెలవులకు ఇంటికి వచ్చినప్పుడుమాత్రం అనసూయ విషయం తెలిసేది. ఆ ఏడు సంవత్సరాలలోనూ అనసూయ తల్లితండ్రులు చనిపోవడం తప్ప వేరే చెప్పతగిన సంఘటనలు జరుగలేదు.

ఉద్యోగంలో చేరిన క్రొత్త రోజులలో స్నేహితుడు జగ్గు ఉత్తరం వ్రాశాడు, దగ్గరే కనుక వచ్చి వాళ్ల ఊరు పాలెంలో కలుసుకొమ్మని. పాలెం రామచంద్రపురానికి రెండు మైళ్ళ దూరంలో ఉంది. అనసూయ అక్కయ్యను కూడా చూడాలనిపించింది. బయలుదేరాను.

**వై. వి. రామారావు**

* * *

రామచంద్రపురంలో జమీందారు గణేశ్వరరావుగారి మేడను తేలికగా తెలిసికోగలిగాను. అది రెండు అంతస్తుల భవంతి. దాని చుట్టూ మామిడిచెట్లూ, పనసచెట్లూ ఉన్నాయి. ఇంటి ముందు ఆవరణలో నాగరికతకు చిహ్నంగా ఒక చిన్న పచ్చికబయలు (లాన్) ఉంది. దాని చుట్టూ పువ్వులమొక్కలు కుండీల పెంచబడుతున్నాయి.

ఇంటిలో ప్రవేశించి తిన్నగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి కుడివైపుకు తిరిగాను. "ఎవరూ?" అన్న కంఠం వినిపించింది. సగం తెరిచి ఉన్న తలుపులలోనుండి చూచాను. అనసూయ నేలమీద కొంగు పరచుకొని పడుకొని ఉంది. కంగారుగా లేచి పైటకొంగుతో శరీరాన్ని కప్పుకొంటూ రెండు క్షణాలు పరిశీలించి చూసి. "ఎవరు? రామం ... నువ్వేనా — ?" అన్నది.

"అవును, అనసూయక్కా" అన్నాను.

అనసూయక్కయ్య జమీందారిణి. మేడలో రెండవ అంతస్తులో పందిరి మంచముమీద పడుకొని హాయిగా పనిమనిషిచేత కాళ్ళు ఒత్తించుకొంటూ ఉంటుంది — ఇది నేను ఊహించిన దృశ్యం. కాని, చూసినది దానికి సరిగా వ్యతిరేకం.

"ఎన్నాళ్ళకు చూశాను, తమ్ముడూ? చాలా పెద్దవాడివైపోయావు. అరె నిల్చుండిపోయావేం? ఇలా కూర్చో" అంటూ బల్ల బయటకు తెచ్చివేసింది. కూర్చున్నాను.

"ఐతే ఏమి చేస్తున్నావు, తమ్ముడూ?" ఆత్రుతగా ప్రశ్నించింది.

"నువ్వే చెప్పుకో ఏంచేస్తూ ఉంటానో?" చిన్నతనపు కలుపుగోరుతనం తెచ్చుకొని ఎదురు ప్రశ్న వేశాను.

"ఏదో పెద్ద లాయరువో, డాక్టరువో అయి ఉంటావు." నిస్పందేహంగా పలికింది.

"లేదు, అనసూయక్కా. లెక్చరరుగా పని చేస్తున్నాను."

"అదేమిటి, తమ్ముడూ! వకీలునైనా అవుతాను లేక డాక్టరునైనా అవుతాను, ఏదీ కాకపోతే కథలు రాస్తాను అనేవాడివిగా?" ఆశ్చర్యం ప్రకటించింది అనసూయ.

వెలకు రు. 400/- సంపాదించండి

350 జపాన్ పరిశ్రమల గైడ్ రు. 12-8 0 బొమ్మలతో ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ రు 4 -. ఫొటోగ్రఫీ రు. 3/ . టైలరింగ్ అండ్ కటింగ్ గైడ్ రు. 4/-, ఎలెక్ట్రిక్ అండ్ రేడియో గైడ్ రు. 8-8-0. వివాహాశీపతం రు. 100 బొమ్మలతో- రు. 5/-. పోస్టేజి ప్రతి పుస్తకానికి రు. 1 4-0 అదనం.

VANDANA BOOK DEPT (ATG)
RAFATGANJ, ALIGARH (U.P.)

పాకెట్ ప్రెస్



పేర్లు, చిరునామాలు, ఉత్తరాలు, లేబెల్సు వగైరాలను దీని సహాయంతో ఇంట్లోనే చక్కగా ముద్రించుకొనవచ్చును. నెం. 1. రు. 2—50 లు. నెం. 2. రు. 3—50 లు. స్పెషల్ రు. 5—50 లు. అత్యుత్తమమైనది. రు. 7—50 లు. పోస్టేజి రు. 1—75.

AMERICAN STORE (A.W.-4)
265|12|1|C,
Gopal Lal Thakur Road, Calcutta-36.



ఐటెక్సు బింది

వివిధ ఆకర్షణీయమైన రంగులలో అన్నిచోట్ల లభించును.

అరవింద్ లేబరేటరీస్

పి. బి. నెం. 1415, మద్రాను-17.

తెలంగాణా జిల్లాలకు, హైదరాబాద్ మినహా ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు:

ప్రగతి ఏజెన్సీస్, విజయవాడ-1.

# మృగతృష్ణ

"మనం అనుకున్నవి అనేకం జరుగవు, అక్కయ్యా. ఏంచేస్తాం?" అప్రయత్నంగా అన్నాను.

"అంతేలే, తమ్ముడూ. ఏది ఎలా జరుగాలో అలాగునే జరుగుతుంది. మా మరదలూ, ఆవిడ మరదిగారూ సెలవులకు వచ్చారు. పొలానికి షికారు వెళ్లారు. ఇక తిరిగి వస్తూ ఉంటారు" అని విషయం మార్చింది.

"ఇల్లు ఇంత నిశ్శబ్దంగా ఉందేమిటి? పిల్లలూ, బావగారూ ఏరి?"

"పిల్లలా — ఎవళ్లూ లేరు, తమ్ముడూ. ఒక్క కూతురు పుట్టి రెండు నెలలు బ్రతికి పోయింది. బావగారు మేడమీద ఉంటారు. పద, వెళ్లి చూదాం" అంటూ కొంగుతో శరీరమంతా కప్పుకొన ప్రయత్నిస్తూ హాలులో ఎడమప్రక్కగా ఉన్న మేడమెట్లు ఎక్కింది. ఆమెను నేను అనుసరించాను. మేడమీద వరండా లోనికి వెళ్లి రెండవ గుమ్మందగ్గర ఆగి తొంగి చూచి "ఆయన తెలిసే ఉన్నారు. నువ్వు వెళ్లి మాట్లాడిరా, తమ్ముడూ" అని చెప్పి మెట్లు దిగిపోయింది.

బూట్ల శబ్దం విని ఆయన తల పైకి ఎత్తారు. నేనే సంభాషణ ప్రారంభించాను.

"నమస్కారమండీ ... మిమ్మల్ని బావగారని పిలవమన్నారా, గణేశ్వరరావుగారని పిలవమన్నారా?"

కళ్లజోడు ఎడమ చేతితో తీసి కళ్లు తుడుచుకొని కుడిచేతి వేలిని నావేపు చూపుతూ, "మీరు ... ?" అని ప్రశ్నార్థకంగా చూచారు.

"వానపల్లి వాస్తవ్యుణ్ణి. అనసూయ అక్కయ్యగారూ, మేమూ ఇరుగు పొరుగుల ఉండేవారం." పరిచయం చేసుకొన్నాను.

"ఓహో! వానపల్లిలో ఒకే ఒక వ్యక్తిని ఎరుగుదును. ఆయన ఎవరోకాదు. పెళ్లి ప్రసక్తి తెచ్చి అన్ని ఏర్పాట్లూ చేసిన శాస్త్రుర్లు గారే ... పెళ్లి పేరు చెప్పి ఒక వంద రూపాయల వరకూ స్వాహా చేశాడు" అంటూ కళ్లజోడు ధరించి న్యూసుపేపరులోనికి చూచాడు.

మనిషి పద్ధతి చూడగానే ఏవగింపు కలిగింది. అతిథి వస్తే కుశల ప్రశ్నలు మాని, ఎవడో శాస్త్రుర్ల సంగతి ఎత్తడం అంత మర్యాదస్తుల లక్షణంగా తోచలేదు. వెంటనే వెనుదిరిగి వెళ్లడంకూడా నాకు భావ్యమనిపించలేదు. ఏదో విధంగా ఆయనతో మాట్లాడాలి. "అనసూయ అక్కయ్యను చేసుకొన్నందుకు కలిగిన లాభంలో మీకిది ఒక లెక్కలోనిది కాదుగా!" లాభం అన్న మాటకు అదృష్టం అని నా మనోభావం. అన్నదానిని సరిదిద్దబోయాను. అంతలోనే ఆయన ప్రశ్నించారు.

"చూడు ... నీ వయస్సెంత?" కళ్లు చిట్లిస్తూ అడిగారు.

"ఉంటాయిలెండి ఒక పాతికవరకూ." అయిష్టంగా జవాబిచ్చాను.

"ఇదిగో, రెండు పాతికలు ఏళ్లైమీద ఎనిమిది వేస్తే వచ్చినంత వయసు నాది. నాదగ్గర లాభ నష్టాల సంగతి ఎత్తడానికి నీవు బొత్తిగా కుర్రవాడివి." సూటిగా కళ్లలోనికి చూస్తూ అన్నారు గణేశ్వరరావుగారు. వెళ్లిపోవాలి అనుకుంటూండగా మళ్లీ ప్రశ్నించాడు.

"ఇంతకూ అనసూయ నీకు ఏ విధంగా తెలుసునన్నావ్?"

"ఇరుగుపొరుగుల ఉండేవారం. చిన్నప్పుడు ఇద్దరం ఆడుకొనేవారం."

"ఓ! అలా చెప్పు. కుర్రవాళ్లకి, అందులో పెళ్లికానివాళ్లకు చిన్ననాటి ఆడ స్నేహితులంటే అభిమానం ఉంటుందిలే." వెటకారంగా అన్నారు.

"అనుభవజ్ఞులు, మూడుసార్లు ఆ బాధలు భరించి పెండ్లి చేసుకొన్నవారు మీరు అలా సెలవిస్తే కాదనగలవాడనా? వస్తా. సెలవు" అంటూ వెనుకకు తిరిగి రెండు అంగలు వేశాను.

"ఒక్క మాట." గణేశ్వరరావుగారి కంఠం గంభీరంగా వినిపించింది. వెనుకకు తిరిగి చూడకుండా ఆగాను.

"మూడుసార్లు పెళ్లి చేసుకొన్నానని ఆవహాసించావు. నిజమే ... కాని ఆ మూడుసార్లూ కూడ నేను జీవితంలో మోసగింపబడ్డానని ఊహించగలవా?"

ఆయన ఎందుకు ఈ ప్రశ్న వేశాడో అర్థం కాలేదు. వెనుకకు తిరిగాను. ఆయన కళ్లు నన్నే చూస్తున్నాయి. ఒక్కసారి ఏదో విషపూరిత వాతావరణంలో ఉన్నట్లనిపించింది.

"ఇంతవరకూ ఒకరివలన మీరు మోసపోయినట్లుగానే చెప్పారు. కాని, మీవలన మోసగింపబడిన వ్యక్తి ఒక్కరైనా ఉన్నారేమో మీరు ఎన్నడైనా ఊహించారా?" పెద్ద చిన్నల తారతమ్యాన్ని త్రోసిపుచ్చి కఠినంగా ఎదురు ప్రశ్న వేశాను. ముఖం చిట్లించి, "నీకు వేళ అయినట్లుంది?" అని వెళ్లమన్నట్లు స్పష్టీకరించారు.

"అవును. కాని నేను వేసిన ప్రశ్న మరొక్కమారు మీ అంతరాత్మను అడగండి. లాభనష్టాలు, మోసాలు అనే నికృష్టపదాలు మరిచి కొద్దిగా మనోద్బావాన్ని పెంపొందింపజేసుకోండి, బావగారూ" అని చెప్పి మేడ మెట్లు చక చక దిగాను.

మెట్లు దిగుతూండగా మధ్యలో ఒక యువకుడూ, యువతీ కనిపించారు.

"వదినగారి వానపల్లి స్నేహితుడు ఇతడే అనుకొంటాను" అని ఆమె ఆతనితో అనడం నాకు వినబడింది. మెట్లు దిగి వచ్చేసరికి అనసూయ బయటకు వచ్చి గదిలో కూర్చుండమని చెప్పి పైకి వెళ్లింది.

ఎంత ఉత్సాహంతో వచ్చానో అంత నిరుత్సాహం పొందాను. ఎవరినైనా కలుసుకోవాలనే

ఆసక్తికూడ హరించుకుపోయింది. అంతలో అనసూయ వారిద్దరినీ వెంటబెట్టుకొని వచ్చి పరిచయం చేసింది. ఆమె పేరు జానకి. ఆతని పేరు దివాకర్. మెడిసిన్ పూర్తి చేశారట. పరిచయం చేయడం పూర్తి అయింది. ఏమి మాట్లాడ్డానికి పుచక్కరించక దిక్కులు చూస్తూ నిలబడ్డాము.

"అలాగు చూస్తున్నావేం, తమ్ముడూ? ఈ గది నాదే." నా అనుమానాన్ని నివృత్తి చేస్తున్నట్లు పలికింది అనసూయ

"అవునండీ. వదిన క్రిందనే ఉంటుంది." జానకి అన్నది.

"అంతేలెండి. పై అంతస్తులో ఉండటం చేతకానివాళ్లకు ఎక్కడైనా ఒక్కటే." దివాకర్ వ్యంగ్యంగా అన్నాడు. వాక్చాతుర్యాన్ని ప్రకటించుకోవదలచి అన్న ఆ మాటలు ఆతని సంస్కారానికి గీటు రాళ్ళు.

"క్షమించండి. నాకు వేరే పనులున్నాయి. వస్తాము" అంటూ బయటకు వచ్చేశాము. వెనుక నవ్వులు వినబడ్డాయి.

అనసూయ నా వెనుకనే వచ్చింది.

"వెళ్తున్నాను, అనసూయక్కా. మళ్లీ కలుస్తానో, కలువనో చెప్పలేను కాని, ఎక్కడున్నా నీ శుభాన్ని కాంక్షిస్తాను" అని చెప్పి ముందుకు సాగాను.

"దానికేంలే, తమ్ముడూ. కాని, అసలు విషయం మరిచిపోయావు."

"ఏమిటది?" అకస్మాత్తుగా వెనుకకు తిరిగి అనసూయను అడిగాను.

"నేను చిన్నప్పటినుంచీ అడుగుతున్నదే ... నా కథ. ఈసారి తప్పక వ్రాయి. నువ్వు చూసినవి చూచినట్లే, అనుకొన్నవి అనుకొన్నట్లే వ్రాయి."

"సరేలే" అని అక్కడినుండి నిష్క్రమించాను.

ఆ క్షణంనుంచి రెండేళ్లవరకు ఆమె విషయం స్మరించలేదు.

రెండు సంవత్సరాల తరువాత, కలకత్తా యూనివర్సిటీ ఇంటర్వ్యూకు పిలిచింది. ఇంటర్వ్యూ అయిన తరువాత ఆ రోజు సాయంత్రం కాళీఘట్టానికి వెళ్లి కాళీమాత దర్శనం చేసుకొని బయటకు వచ్చాను. చెప్పులు వదిలిన దుకాణాన్ని సమీపించాను. ఎవరో వ్యక్తి నన్ను తదేకదృష్టితో చూస్తున్నాడు. బంగాలీ పద్ధతిలో లాల్చీ, పంచ ధరించిన ఆ వ్యక్తి దివాకర్ అని గ్రహించడానికి నాకు ఒక నిమిషం పట్టింది. వెంటనే పలకరించాను.

"మీరు" ... అంటూ పేరు తెలియక ఆగిపోయాడు.

నా పేరు చెప్పి "ఇక్కడ ఏమి చేస్తున్నారు?" అని అడిగాను.

"మెడికల్ కాలేజిలో లెక్చరరుగా ఉంటున్నాను."

"ఎక్కడ ఉంటున్నారు?" యథాలాపంగా అడిగాను. ఏదో ఆలోచిస్తున్నట్లు ముఖంపెట్టి నా ప్రశ్నకు సమాధానం ఇయ్యలేదు దివాకర్. మళ్లీ అదే ప్రశ్న వేశాను.

"ఆ! నేనా? చిత్తరంజన్ ఎవెన్యూలో ఉంటున్నాను. ఆనంద్‌భవన్ ప్రక్కనే లెండి" అని బెరుకుగా సమాధానం ఇచ్చాడు.

తన్నుగూర్చి నేను తెలుసుకొనడంపట్ల అయిష్టతను ప్రకటిస్తున్నాయి అతని కండ్లు. అనసూయ విషయం అడగాలనే ఆత్రుతను అణచివేసుకొని సంభాషణను ముగించి పది అంగలు వేశాను. అంతలోనే "మిస్టర్ రావ్! ఒక్క మాట" అంటూ దివాకర్ నన్ను సమీపించాడు.

"మీకు అభ్యంతరం లేకపోతే కొన్ని విషయాలు చెప్పాలనుకొంటున్నాను మీతో." ఉట్టి పడుతున్న సభ్యతతో, ఇంగ్లీషులో తిరిగి ప్రారంభించాడు సంభాషణ.

ఏమిటి? అన్నట్లు చూచాను దివాకర్ ముఖంలోనికి. సాయంత్రం అవుతున్నకొలదీ కాళీఘాట్‌లో జనం రద్దీ పెరిగిపోతూన్నది. చుట్టూ త్రోసుకుపోతున్న జనాన్ని చీదరించుకొంటూ అడిగాడు దివాకర్:

"మీకు రేపు ఏమైనా అత్యవసర పను లున్నాయా?"

"ఒక్కసారి ప్రొఫెసర్‌ని చూచి రావాలి. రెండు గంటల తరువాత పని ఉండదనుకుంటాను" అన్నాను.

"ఐతే దయచేసి నాలుగున్నర గంటలకు రేపు విక్టోరియా మెమోరియల్ హాలుకు రండి. అక్కడే సావకాశంగా కొన్ని విషయాలు చెబుతాను. ప్లీజ్! మీకు శ్రమ కలిగిస్తున్నందులకు క్షమించండి!" అనురోధించాడు దివాకర్. అంగీకరించి హొటల్‌కు వెళ్లిపోయాను.

మరునాడు సాయంత్రం నాలుగున్నరకు విక్టోరియా మెమోరియల్ హాల్ వద్దకు చేరాను. నాకొరకే వేచి ఉన్నట్లు దివాకర్ ముఖం చెప్పింది. కృతజ్ఞతా పూర్వకంగా నన్ను చూచి, లాన్ ప్రక్కగా ఉన్న వేపచెట్టు వద్దకు దారి తీశాడు. ఇద్దరమూ చెట్టు క్రింద కూర్చున్నాం. అనసూయ విషయం దివాకరే ప్రస్తావించాడు. తెలుసుకోవాలన్న విషయం అయాచితంగా తెలిసిపోయింది.

చేయకూడదనుకున్న పని ఒక్కసారి చెయ్య వలసివస్తూంది. రెండేళ్ల క్రితం దివాకర్‌తో పరిచయం కలిగిననాడే అతడంటే ఏహ్యభావం కలిగింది.

"పై అంతస్తులో ఉండటం చేతకానివారికి ఏదైనా ఒక్కటే" అన్న అతని మాటలు చెవులలో ధ్వనించాయి.

సంఘంలో అతనికి ఉన్నతమైన స్థానం ఉంది. ఆ కవచం అతనిని ఇన్నాళ్లూ రక్షించింది. కాని మోయగా మోయగా దాని బరువు తెలిసి వచ్చింది. ఇప్పుడు దానికి మరొకరి సహాయం అవసరం. దానికొరకే ఈ కృత్రిమ ఆపేక్ష. వెంటనే అక్కడినుండి వెళ్లిపోవాలనిపించింది.


"మీరు ఒక్కమారు మా ఇంటికి రావాలి." ఆప్యాయత ఒలకపోశాడు దివాకర్.

ఈ ఆహ్వానానికి పెద్ద ప్రతిఫలం దివాకర్ ఆపేక్షిస్తున్నాడన్న విషయం నాకు తెలుసు. సంశయించాను.

"సంశయించకండి. స్నేహితుడుగా మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను" అన్నాడు.

స్నేహం అనే మాటను కలుషితం చేసింది ఆ పలుకు. ఆహ్వానాన్ని తిరస్కరించి వెళ్లిపోవాలనుకొన్నాను. కాని, మనసులో అనసూయను చూడాలన్న కోర్కె బలీయమైపోయింది.

రాత్రి ఎనిమిది గంటలకు నెమ్మదిగా చిత్తరంజన్ ఎవెన్యూ చేరుకొన్నాం. ఆ భవంతిలోని మూడవ అంతస్తులో ప్రవేశించిన తరువాత ద్వారం దగ్గర ఉన్న ప్రెస్‌బటన్‌ను నొక్కాడు దివాకర్. కలకత్తా నాగరికతను అనుసరించి



పశుగ్రాసం

చిత్రం — ఎం. ఎస్. రావు (శ్రీశైలం)

అలంకరించుకొన్న యువతి తలుపు తెరిచింది. రెండేళ్ల క్రితం చూచినప్పటికన్న తగ్గిపోయింది గణేశ్వరరావుగారి చెల్లెలు.

"జానకీ, ఈయన జ్ఞాపకమున్నారా?" దివాకర్ నవ్వు తెచ్చుకొంటూ ఆమెను అడిగాడు.

"క్షమించండి ... మీరు?" ప్రశ్నార్థకపు నగలు కురిపిస్తూ చేతులు జోడించింది జానకి. దివాకర్ నన్ను పునఃపరిచయం చేశాడు.

"ఓహ్! గ్లాడ్ టు సీ యూ, కూర్చోండి" అంటూ సోఫాలో కూర్చుండిపోయింది.

ఆమె ఒక్కర్తే అప్పటికి దివాకర్ 'పేషెంట్'. హృద్రోగంతో సంవత్సరంనుండి బాధపడుతున్నదట. మొదటినుండి దివాకరే 'ట్రీట్' చేస్తూండడంవలన ఆతని వద్దనే చికిత్స పూర్తి చేయించుకోదలచిందట. భర్తకు వ్యవసాయంవలన తీరికలేక, వేరే మరొక

# మృగతృష్ణ

పట్నంలో ఉండటం ఇష్టంలేక దివాకర్‌నే నమ్ముకువచ్చినదట. విక్టోరియా మెమోరియల్ వద్ద దివాకర్ నాతో చెప్పిన విషయం ఇది.

జానకితో నేను మాట్లాడుతూండగా దివాకర్ లోనికి వెళ్ళాడు. పది నిమిషాల తరువాత అనసూయ కాఫీ ట్రేతో ప్రవేశించింది. రామచంద్రపురంలో చూచినవాటికన్నా తుష్కించి పోయింది. ఇంచు మించు అదే వేషం. ఆమె బల్లమీద ట్రే పెట్టగానే దివాకర్ జానకిని పిలిచాడు. అనసూయకు నాతో మాట్లాడే అవకాశం ఇవ్వాలని అతని ఊహ.

చీరకొంగుతో శరీరాన్ని దాచుకొన ప్రయత్నిస్తోంది అనసూయ. ఏమి మాట్లాడాలో తెలియక కాఫీకప్పు ట్రే లో నుండి తీసుకొన్నాను.

"ఐతే అన్ని సంగతులూ నీవే ఉంటావను కొంటాను, తమ్ముడూ" ... ఏళ్ళతరబడి సన్నిహితంగా మెలుగుతున్నవారితో మాట్లాడుతున్నట్లు యధాలాపంగా అడిగింది. ఆమె ముఖం ఉద్రేకం, విచారం ఇత్యాదులకు అతీతంగా గోచరించింది.

"మిగతా విషయాలు నీ నోట వినాలని వచ్చాను, అనసూయా." అంతకన్నా నేను చొరవ తీసుకొనలేకపోయాను.

"చూసేవు కదూ, దివాకర్‌కి వంటపనీ, ఇంటిపనీ చేస్తున్నాను. నెలకి అరవై రూపాయలు ఇస్తారు. భోజనం, నివాసం ఇక్కడే. కానీ ఖర్చు లేదు." అతి ప్రశాంతమైన జీవితాన్ని కథగా చెబుతున్నట్లనిపించింది నాకు.

"మరి, జానకి?" సందేహిస్తూ అడిగాను.

"ఆమె కూడా ఇక్కడే ఉంటున్నది. రాత్రిళ్ళ అప్పుడప్పుడు గుండెల్లో నొప్పి వస్తోంటుంది. దివాకర్ ఆ సంగతి చూస్తాంటారు."

"ఇంతకూ దివాకర్ వివాహితుడేనా?"

"పెళ్ళి అయినట్లే విన్నాను, తమ్ముడూ. ఏదో ఘర్షణపడి ఆమెను పుట్టింటినుంచి తీసుకురాలేదట." పొడిగా సమాధానం చెప్పింది.

"భర్తనూ, ఇంటినీ విడిచి ఇంత దూరం రావడం ఏమీ మంచిపని కాదు, అనసూయా. ఏమి పొందుదామని ఈ తప్పటడుగు వేశావ్?"

"నాకంటె చిన్నవాడవు. లేకపోతే చాల విషయాలు చెప్పి ఉండేదాన్ని. ఏమి పొందుదామని చేసేనో, ఎందుకు చేసేనో ఇంతవరకు ఆలోచించలేదు, తమ్ముడూ. వచ్చేసేను ... దివాకర్ అరవై రూపాయలిస్తారు. అవి కూడ మిగిలిపోతున్నాయి. పోనీ, నేను ఇలా చేసినందుకు నా విషయం ఆయన ఏమైనా తెలుసుకొన ప్రయత్నిస్తేగా? ఆ ఇంట ఉన్నపుడు నాకు ఎంత ప్రాముఖ్యం ఉండేదో బయటకు వచ్చినప్పుడు కూడ అంతే మిగిలింది. దాని గురించి విచారించనక్కర్లేదు."

"ఐతే వచ్చిన తరువాత రామచంద్రపురం వెళ్ళాలనే కోరిక ఎప్పుడైనా కలిగిందా?"

"ఎక్కడకు వెళ్ళడమో ఎప్పుడూ ఆలోచించలేదు కాని ఇక్కడినుంచి వెళ్ళిపోవాలనిమాత్రం దృఢమైన కోరిక కలిగింది, తమ్ముడూ."

విభ్రాంతిపోయాను. జీవితాన్ని ఇంతటి నిమ్నోన్నతాలలో పడత్రోసుకుని అంతటితో ఆగక ఉన్నదానిని మరింత క్లిష్టంగా తయారు చేసుకొంటూన్న అనసూయను ఏమనాలో ఊహించలేకపోయాను.

"ఎందుకు వెళ్ళిపోవాలి? ఎప్పుడు వెళ్ళిపోవాలి?" కారణం అడిగాను.

"నేను ఇక్కడ ఉండటం దివాకర్‌కు ఇష్టం లేదు. ఎప్పుడు వీలైతే అప్పుడు వెళ్ళిపోవాలి"— సూక్ష్మంగా తన ఉద్దేశాన్ని తెలిపింది. నాలో సహనం నశించింది.

"ఏ అధికారంతో ఇక్కడకు నువ్వు వచ్చి ఉంటున్నావ్, అనసూయా?" కోపంగా అడిగాను, ఆ ప్రశ్న వేసే అధికారం నాకు ఉన్నదీ, లేనిదీ ఆలోచించకుండా. జవాబులిచ్చే యంత్రం లాగు పలికింది అనసూయ.

"దివాకర్ తీసికొచ్చేడు. నేను వచ్చేను. అప్పుడు అతని మాటలలో ఏమి ప్రభావం ఉండేదో? వానిని వింటూ మత్తుమందు తిన్నట్లు అన్నిపనులూ చేసేను. ఇంటినుండి బయటకు రావడమే నా వంతు... లోకం ఏమీ అనుకోకుండా ఉండటానికి నాకు జీతం ఏర్పాటు చేసేరు. పైగా దేశంకాని దేశం. ఏమిటో, తమ్ముడూ, నా జీవితంలో ఒక్క పురుషుణ్ణి కూడా అర్థం చేసుకోలేకపోయాను."

ఆ అవివేకపు శాంత్యానికి నిష్కృతి ఎప్పుడో ఊహించలేకపోయాను. ఏదో విధంగా ఆమెకు నచ్చచెప్పి రామచంద్రపురం తిరిగి వెళ్ళే ఏర్పాట్లు చేయడానికి దివాకర్ నన్ను అర్థించాడు. తనదంటూ ఒక నిశ్చిత ఆకారం లేని ద్రవపదార్థంవంటిది ఆమె స్వభావం. ప్రతిరోధన చర్యలేని ఆ ప్రాణిని ఏమి చేయాలో యోచించలేకపోయాను.

"ఐతే ఇక్కడే ఉండిపో — " మొండిగా అన్నాను, ఒక నిశ్చయానికి రాలేకపోయానన్న దౌర్బల్యాన్ని మనసులోనే గర్హించుకొంటూ.

"లేదు, తమ్ముడూ. నేను ఎందుకు ఇల్లు వదిలి వచ్చేనో నాకే తెలియదు. దివాకర్‌కూడా అక్కడే తప్పు చేసేడు. ఇప్పుడు నావలన అతని గౌరవానికి భంగం కలుగుతున్నదట. ఇప్పుడు ఏదో ఒకటి చేయాలి."

"నువ్వు క్షమించరాని తప్పు చేసేవ్, అనసూయా!" కఠినంగా అన్నాను.

"నిజమే, తమ్ముడూ." పేలవంగా జవాబు ఇచ్చింది.

(తరువాయి 58 వ పేజీలో)


## నాకాస్

పేటినుండి ఉబ్బసముతో బాధపడ నవసరం లేదు. ఈ వ్యాధి నిర్మూలనకుగాను పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేద ఔషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 ఔ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకం.

ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

## ఇంకా పొడుగు ఎదగండి



మా నూతన వ్యాయామాలు ఆహార నియమాల క్రమం అనుసరించి ఇతోధికమైన ఆరోగ్యం కూడా చేకూర్చుకోండి. స్త్రీ పురుషుల ఉభయులకూ అనుకూలమైనది. వివరములు ఉచితంగా పొందవచ్చును.

283, Azad Market (A.P.V.), Delhi-6.

## హిందీ-తెలుగుకోష్

85,000 పదములు, జాతీయములు, సామెతలు

హిందీ పరీక్షలలో ఉత్తీర్ణులగుటకు కల్పతరువు వంటిది. వెల: రు. 6/—

ప్రతి విద్యార్థివద్ద నుండదగినది.

బాలసరస్వతీ బుక్ డిపో, మద్రాసు-1.



అది నైరాశ్యపు పరాకాష్ఠ అని చెప్పలేను. మూర్తీభవించిన నిర్లిప్తత అనీ చెప్పలేను.... ఎటువంటి ఆశలతో భర్త ఇల్లు విడిచివచ్చిందో ఆమెకే తెలియదు. దానిమూలంగా తాను పొందినది బాధమో, నష్టమో ఆలోచించే విజ్ఞానమూ లేదు. దివాకర్ తనను వంచించిందీ, లేనిదీ ఆమె ఎప్పుడూ ఊహించలేదు. కాని సూక్ష్మంగా చెప్పాలంటే 'అనసూయ లేచి పోయింది. ఇది ఆమెపై లోకంవేసిన ముద్ర. అదే సంఘంలో ఆమెకు ఈ స్థానాన్ని ఇచ్చింది. తత్ఫలితంగా ఆమెలో ఘృణకాని, ప్రతీకార *వాంఛగాని లేశమైనా ప్రవేశించలేదు. ఆలోచనా* రహితంగా ఐదు నిమిషాలు కూర్చున్నాను. తరువాత లేచి నిలబడ్డాను.

"ఇన్ని విశేషాలున్న నా జీవితంమీద ఒక్క కథ వ్రాయలేవా, తమ్ముడూ? తప్పక వ్రాయి, తమ్ముడూ, నువ్వు చూచినదీ, ఊహించినదీ యథాతథంగా వ్రాస్తే నాకథను నేనే చదువుకొంటాను." తిరిగి ఆ విపరీతపుకోర్కెను బయట పెట్టింది.

"వికసానికి ముందే మృతిజెందే జీవులు కొన్ని ఉంటాయి. వాటి బ్రతుకు బహు నికృష్టమైనది" అన్నమాటలు పెదిమల వరకూవచ్చి ఆగిపోయాయి.

"ఎక్కడ ఉన్నా నీమేలు కాంక్షిస్తాను. అదే నేను చేయుగల పని" అని చెప్పి ద్వారందాటి బయటకు వచ్చాను. మేడమెట్లవద్ద దివాకర్ నిలబడి ఉన్నాడు. అతని ప్రశ్న అర్థమైంది నాకు.

# మృగతృష్ణ

( 8 వ పేజీ తరువాయి)

"డాక్టర్ దివాకర్! అనసూయ మృతకల్ప. ఆమెవలన మీరు ఎప్పుడూ ఏవిధమైన కీడూ శంకించవలసిన అవసరం ఉండదు. ఆమె ఇక్కడ ఉండటం ఇబ్బంది అయితే ఏదో ఒక రైలు ఎక్కించివేయండి. అంతటితో మీ బాధ్యత తీరిపోతుంది. ఎక్కడకు వెళ్ళాలి? అన్న విషయం ఆమె అడగదు. మీకు అక్కర్లేదు. ఆమె ప్రతీకార చర్యలేని ప్రాణి. జీవశాస్త్రం చదువుకున్న మీరు ఇక్కడే పొరపాటు చేశారు. ఆమెను ఇంటి గడప దాటించడమే పొరపాటు. ఆటు తరువాత ఏమిచేసినా ఫలితం ఒక్కటే" అంటూ ఆ కఠోర వాతావరణాన్ని సహించలేక త్వరగా మెట్లు దిగి బయటపడి నడక సాగించాను. దివాకర్ నన్ను ఆపగలనంపే ప్రయత్నం విరమించుకొన్నాడు.

*  *  *

అనుకొన్న కాశీయాత్ర ఆచరణలోనికి వచ్చే సరికి పంచవర్ష ప్రణాళిక ఒకటి పూర్తి అయింది. దసరా సెలవులలో అమ్మను, నాన్నగారిని తీసికుని కాశీ వెళ్ళాం.

నాడు మణికర్ణికకువెళ్ళి స్నానాలుచేసి దశాశ్వమేధ ఘట్టానికి తిరిగివచ్చి కాలినడకను విశ్వేశ్వరుని దర్శించాం. వెనుకకు తిరిగి దశాశ్వమేధ ఘట్టము నుంచి కేదారేశ్వరుని మందిరానికి వెళ్లే గల్లీలో ప్రవేశించాం. కేదారేశ్వరుని మందిరానికి నలుబది గజాలముందు ఎడమవైపునున్న చౌకబారు హోటలులోనున్న వ్యక్తిని చూచి హఠాత్తుగా ఆగాను. దారి చూపడానికి పండా పంపిన కుర్రవానితో అమ్మనూ, నాన్నగారినీ ముందుకు పంపి హోటలు వద్దకు వెళ్ళాను. కోటిముందు పీట మీద కూర్చుని పిండి రుబ్బుతున్నది అనసూయ. ప్రక్కనే హిందీ 'అఆ'లు దిద్దుతూన్న ఆడపిల్ల కూర్చుని ఉంది. మరికొంత దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను. నఖశిఖ పర్యంతంచూచి "రామూ వేనా?" అన్నది.

"అవును, అనసూయా." నెమ్మదిగా అన్నాను.

"ఎన్నాళ్ళనుండి ఇక్కడ ఉంటున్నావు?" ప్రశ్నించాను.

"ఐదేళ్ళు దాటింది, తమ్ముడూ."

అదే తటస్థభావం. ఆనందం, వ్యాకులత, భయం ఇత్యాదులకు అతీతమైంది ఆమ ముఖం. ప్రక్కనే కూర్చున్న పాపను చూస్తూ అన్నాను:

"పాపాయి పేరేమిటి?"

"పంకజ అని పిలుస్తాను, తమ్ముడూ. అదృష్టవంతురాలు కావాలని దీవించు!"

"ఇక్కడ ఏవిధంగా గడుపుతున్నావ్?" ప్రస్తావన మార్చాను.

"ఇదిగో, ఈవిధంగా ఇక్కడ ఉన్న మరాఠీ హోటళ్ళలో పిండి రుబ్బుతాను. అప్పుడప్పుడు తెలుగువాళ్ళ ఇళ్ళల్లో వంటచేస్తాను. విజయనగరం రాజావారి సత్రంలో గది ధర్మానికి ఇచ్చారులే. అందులో ఉంటున్నాం. ఏదో విధంగా రోజులు నెట్టుకు వస్తున్నా. పంకజం పెద్దదై పరీక్షలు వ్రాసి నాదినం తీర్చుతుంది." పంకజాన్ని చూస్తూ పలికింది.

అనసూయ చేసిన తప్పుల ఫలం పంకజ పాప ఫలం అన్నా తప్పులేదేమో! కాని అనలేను. అనసూయతోపాటు కష్టాలు అనుభవించి చివరకు అనసూయను పోషిస్తుంది. అనసూయ ఆశలకు ఆధారం ఆ పసిబాలిక. నన్ను చూసి చిరునవ్వు నవ్వింది పంకజ.

"ఎక్కడ పుట్టింది?"

"కంకత్తాలోనే పుట్టింది." కొద్దిగా నాదగ్గరకు జరిగి హీనస్వరంతో పలికింది.

"ఇక్కడ ఉన్నవాళ్ళందరికీ నాకూతురనే చెప్పాను. అసలు ఇది జానకి కూతురు. ఈసంగతి ఎవ్వరికీ చెప్పకు. దివాకరూ, జానకీ దీనిని హాస్పిటల్లో ఒమ్మన విడిచిపెట్టాలనుకొన్నారు. ఆ విషయం పసిగట్టి అర్ధరాత్రే వారిని వెంబడించాను. వాళ్ళు వదిలిన వెంటనే నేను దీనిని తీసుకుని హౌరా స్టేషనులోపడి ఇక్కడకు చేరుకున్నాను..... పెంచి పెద్దచేసిన వాళ్ళే బిడ్డకు తల్లిదండ్రులవుతారు. పంకజం పెద్దదై నన్ను పోషిస్తుంది. కూతురయినా, కొడుకయినా నాకు ఒక్కటే."

విస్మితుడనై పోయాను. మస్తిష్కం

# వారఫలాలు

తంగా సాగిపోతుంటవి.

## మకరం

(ఉ. షా. 2,3,4 పా., శ్రవ., ధని 1, 2 పా.)

గ్రహస్థితి మీకు అంతగా అనుకూలిస్తుందని తోచదు. అన్నివిధాలా తగ్గి ఉండటమే మంచిది. అయిన వారికి కూడా ప్రస్తుతం అంత్యములు భేదిస్తుంటవి. విరోధులవలెనే ప్రవర్తిస్తారు. అందువల్ల మీకు జరుగబోయే ప్రత్యేకమైన ఇబ్బందులు కనుపించవు. మీరుమాత్రం ఏ విషయంలోనూ తొందరపడక సమయం కొరకు వేచి ఉండటం మంచిది. ఉద్యోగ వ్యాపారాదులన్నీ యథాక్రమంలో సాగిపోతుంటవి. అసహనపరులు కొందరు సమయం కొరకు చూస్తుంటారు. జాగ్రత అవసరం. మీ ఆరోగ్యం శ్రద్ధగా చూచుకొనుట అన్నిటికంటే ముఖ్యం.

## కుంభం

*(ధని 3,4 పా., శత., పూ. భా. 1, 2, 3 పా.)*

కాలం కలిసివస్తుంది. తలచిన పనులన్నీ సక్రమంగా నెరవేరుతవి. ఖర్చులు కనుపించినా ప్రయోజనం అనేది ఉంటుంది. ప్రయాణ సూచనలు ఉన్నవి. గొప్పవారితో స్నేహం, పాత వారిలో గౌరవం, విద్యావివాదాలలో జయం సమకూరుతవి. ఉద్యోగాలలో హోదా అధికారాలు పెరిగే సమయం. వ్యాపారంలో మీ ఆలోచనలు, మీధైర్యం ఫలిస్తవి. స్పెక్యులేషన్ వంటి వ్యాపారాలుకూడా కొంతవరకు లాభదాయకంగా ఉంటవి. అత్యాశకు పోయినపుడు మాత్రం దెబ్బతినటం సంభవిస్తుంది. కుటుంబంలో శుభములుకూడివచ్చి సుఖసంతోషాలు లభిస్తవి.

## మీనం (పూ. భా. 4 పా., ఉ. భా., రేవతి)

ప్రస్తుతం ధైర్యం, అంతకు మించిన సహనం అవసరం. క్రమంగా అన్ని వ్యవహారాలూ దారికి వస్తవి. నూతన మార్గాలలో ద్రవ్యం సమకూరి తొందరలు తీరుతవి. అధికారవర్గంలో మీ మాటకు గౌరవం లభిస్తుంది. సాధ్యమైనంత వరకు ఇతరుల తగాదాలలో జోక్యం కల్పించుకోవద్దు. లేనిపోని నిందలు వస్తుంటవి. తొందరపడతగు సమయం కాదు. ఉద్యోగ వ్యాపారాలు సామాన్యానుకూలంతో సాగిపోతుంటవి. నూతన వ్యాపారములు, ఉద్యోగ ప్రయత్నములు అంతగా అనుకూలించవు. ఆరోగ్యం శ్రద్ధగా చూచుకొనుట ముఖ్యం. ★

## ...లు

(2 వ పేజీ తరువాయి)

మన జానపద గాథల్లో కథ ఎదురుతిరిగితే, ఆకాశవాణి సహాయం చేసేది. అలాగే ఈ సాంఘిక గాథల్లో 'లాటరీ బహుమానం' ఆదుకొంటూ ఉంటుంది.

కాని ఈ లాటరీ 'వస్తువు' చాలా పాతపడి పోయింది. సినిమాలు తెగవాడేసి దాన్ని నిర్జీవంగా తయారుచేశాయి. ఇప్పుడు రేడియో నాటికల్లో ఆఖరు మూలుగు మూలుగుతూ ఉంది.

'కథలు'గా మొదటిరెండూ చక్కగా ఉన్నాయి. కాని మూడవ కథ మాత్రం 'పరిపూర్ణత' నందుకోలేదు.

నాలుగవ కథ(తూనీగలు)లో, సమస్య ఏమిటో అర్థం కావడం లేదు. రచయిత్రిలో మంచి పరిశీలనా శక్తి ఉన్నది. కాని 'వస్తువు'లో పసలేకపోవడం మూలాన్ని, యీకథ పిల్లల కథలా తయారయింది.

"ఈకథలు మొత్తం మీద మున్నెన్నడూ లేనంతటి సంతృప్తికరంగా ఉన్నవని చెప్పడంలో సందేహం లేదు" అన్నారు సంపాదకీయంలో. క్షమించండి. మీ అభిప్రాయంతో నేను ఏకీభవించలేక పోతున్నాను. 'చకోరి', 'నాగమ్మ' 'దివాణం' లాంటి వజ్రపు తునకల్ని అందించిన ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక యిలా అవడం అంత సమంజసంగా లేదేమో!

ఈ ఏడాది కథలలో మొత్తంగా చూస్తే మాత్రం, పైన చెప్పిన కథల్లోని 'దేశీయత' లేదు. నిరుడు, 'దీపం పురుగులు'లో వినిపించిన 'హృదయస్పందన' యీ యేడు లేదు.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక మీద ఉన్న గౌరవాభిమానాలతో చనువు తీసుకొని నాకు తోచింది చెప్పాను. మన్నించండి.

రోజురోజుకూ, సాహిత్యపు విలువలు పెంచుతున్న మీ కృషికి నా అభినందనాలు.

నమస్కారాలతో,

—దుత్తా దుర్గాప్రసాద్
(విజయపురి సౌత్)

### సందేహం

ఉగాది నవలల పోటీ చూచినాము. చిన్న సందేహము వచ్చినది. బొమ్మలు కూడా మేము వేసి పంపించవలయునా?

—సరోజినీదేవి
(పెరిదేపి)

★ రచయిత (త్రు)లు చిత్రాలు పంపవలసిన అవసరం లేదు.
—ఎడిటర్]

* * *

భారతదేశ సైనికులుగా ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని వందల మైళ్ళ దూరంలో ఉన్న మాకు ప్రతివారము ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక మా హవల్‌దార్ ఇచ్చినప్పుడు ఎంతో సంతోషంగా ఉంటుంది.

అచ్చం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్లు భావిస్తూ మళ్ళీ వచ్చే సంచికకొరకు ఎదురు చూస్తూ ఉంటాము.

ప్రభ ఇంకా మంచి కథలు, వ్యాసాలు, విమర్శలు, చిత్రాలు, డిజైనులతో దినదినాభివృద్ధి నొందగలదని ఆశిస్తున్నాము. మా ఆంధ్ర సైనికుల తరఫున—

—జి. శ్రీనివాసరావు

### ఫోటోలు బాగులేవు

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 13-11-63 తేదీ సంచికలో ఉపమాక గురించి వ్యాసం ప్రచురించారు. వ్యాసమంతా బాగానే ఉంది. కాని ఫోటోలు బాగులేవు. బంధుర సరోవర తీరంలోని స్నానవాటిక ఫోటోచూచి ఉపమాకలో ఈ సరోవరం చూచితినా, లేదా? అన్న సంశయము నన్ను పీడించినది. కొండమీది ఉపమాకేశ్వరుని ఆలయ ముఖద్వారమునకు ఎదురుగా కొండ మీదికి మెట్లు, మార్గమధ్యమున ఒక గేటు ఉన్నవి. ఈ ప్రాంతమువారు ఉపమాకేశ్వరుని 'ఉప్మాక వెంకన్న' అని అందురు. ఈ తీర్థానికి ప్రతి సంవత్సరము ఫాల్గుణ శుద్ధ ఏకాదశికి విశాఖపట్టణముమండి రాజమండ్రి వరకుగల ఆబాలగోపాలము పాల్గొందురు. ఇచ్చట ప్రజలు సంవత్సరమునకు కావలసిన సుగంధ ద్రవ్యములు ఉపమాక తీర్థంలో కొందురు. తీర్థానికి ఉపమాక ప్రసిద్ధి చెందినది.

—కర్రి వెంకటరమణ
(ఎస్. రాయవరం)

### మీకు తెలుసా

## జవాబులు

1 లండన్, ఎడింబరో, కార్డిఫ్, బెల్‌ఫాస్ట్.
2. రెండవ కెన్యూట్.
3. నెదర్లాండ్స్.
4. న్యూ షాటెల్.
5. రోవాల్ అమన్సెన్ (1872-1928).
6. మలకా సంధి.
7. జనరల్ ఛార్లెస్ డిగోల్.
8. రబ్బరు, తగరం. ★

### జాతకం

20—11—63 వ తేది సంచికలో శ్రీ నెహ్రూ జాతక విషయమును శ్రీ ఆర్. ఎస్. సిద్ధేశ్వరశర్మగారి జ్యోతిశ్శాస్త్ర బలముతో నొక్కి చెప్పినట్లు వ్రాయబడినది. దానిలో ద్వితీయ శుక్రుడు, సమసప్తకము వగైరా విషయములు శ్రీ శర్మగారు సెలవిచ్చినారు. దీనికి వారి చక్రము, జననము, దశాంతర్దశలు వ్రాసి ఉండలేదు. కనుక విషయము తెలుసుకొని ఫలితము చెప్పిన శాస్త్రము విలువ పోవుటయేగాని గౌరవించుటగాదు.

—కూనపులి శేషవతారశాస్త్రి
(విజయవాడ—2)

### రాధిక లేదు

'జీవనకలశం'లో రాధిక పాత్ర అద్భుతంగా ఉంది. ఇక రాధిక లేదంటే కండ్లు చెమర్చాయి. ఎవరో ఆత్మీయులు పోయినట్లుగా ఉంది. ఆ పాత్రను ఇంత బాగా చిత్రించిన రచయిత్రి సుమలతగారికి నా అభినందనాలు.

'ఎర్రని కన్నీరు' కథలో 2 బి. డ్రాప్స్‌కోసం వచ్చేవాళ్ళన్నారు. అవి 2 బి. డ్రాప్పుకావు— "జడ్. బి. డ్రాప్పు". ఏది ఏమైనా కథ చాలా బాగుంది.

ఇలాంటి మంచి మంచి కథలు, సీరియల్సు ప్రచురిస్తున్న మీకు నా హృదయాంజలులు.

—కొడాలి రామ్మూర్తి
(రావినూతల) ★

---

ఒక్కసారి శూన్యమైపోయింది.

"దీనిని పెంచి పెద్దచేసినందువలన నీకేమి లాభం, అనసూయా?"

"లాభమేమిటి, తమ్ముడూ! భగవంతుడు దీని కోసమే నన్ను అలాగు త్రిప్పాడు. చివరకు నేను కోరుకున్నది నాకు లభించింది."

"నువ్వు దీనిని కోరుకున్నావా?" విస్మయంతో అడిగాను.

"అవును, తమ్ముడూ. స్త్రీ జన్మ జన్మాలకూ తల్లి కావాలని కోరుకుంటుంది. నాకు పుట్టక పోయినా నావద్ద పెరిగింది. అంతేచాలు." అనసూయ ఆనందాశ్రువులు రాల్చింది. ఇన్నాళ్ళకు ఆమె ముఖంలో సంతోషపు రేఖలు చూడగలిగాను.

పంకజాన్ని ఒడిలో చేర్చుకొని ముద్దాడుతూంది అనసూయ. ఇప్పటికి గ్రహించాను. ఏ మృగతృష్ణ ఆమెను ఇంటినుండి బయటికి రప్పించినదో అది పంకజను ఆమెకు ప్రసాదించింది.

కేదారేశ్వరుని ఉదయార్చనానాదాలు వినవస్తున్నాయి. పవిత్ర గంగావాహిని విందుగా పారుతూంది. అనసూయ కళ్ళనుండి అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. ★